సాక్షి
బాపట్ల
శనివారం । 25 । మార్చి । 2023



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన సూరిపెద్ది వెంకట కనకదుర్గా వరప్రసాద్ శుక్రవారం రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు.



రంజాన్ మాసం ప్రారంభం

పాతగుంటూరు: పవిత్ర రంజాన్ మాస ఉపవాస దీక్షలు (రోజా) శుక్రవారం ప్రారంభమయ్యాయి. గురువారం సాయంత్రం ఆకాశాన నెలవంక దర్శనం కావడంతో దువా చేసి దీక్షలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు.



న్యూస్‌రీల్

మంత్రి మేరుగ న్యాయసలహాదారుగా కృష్ణ



నియామక జీవోను మంత్రి డాక్టర్ నాగార్జున నుంచి స్వీకరిస్తున్న గుంటూరు కృష్ణ

తెనాలి: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున న్యాయ సలహాదారుగా తెనాలి న్యాయవాది గుంటూరు కృష్ణ నియమితులయ్యారు. శుక్రవారం సాయంత్రం మంత్రి చేతులమీదుగా ఆ జీవోను కృష్ణ స్వీకరించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆశీస్సులతో మంత్రి డాక్టర్ నాగార్జున సహకారంతో తన నియామకం జరిగిందని కృష్ణ తెలిపారు. సంవత్సర కాలం ఈ పదవిలో కొనసాగుతారు. గుంటూరు కృష్ణ స్వస్థలం వేమూరు నియోజకవర్గంలోని కొల్లూరు మండలం గ్రామం గుంటూరుగూడెం. 20 ఏళ్లుగా తెనాలిలో న్యాయవాదిగా ఉన్నారు. అంతకుముందు తెనాలి కేంద్రంగా పత్రికా విలేకరిగా చేశారు. జర్నలిస్టు అనుభవంతో 2004–09లో డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి పరిపాలనపై 'లక్ష్యం–సాక్ష్యం' పుస్తకాన్ని రచించి, వారితోనే ఆవిష్కరింపజేశారు. 2010లో 'నాయకుడు–వైఎస్ జగన్ పేరుతో డైరీని తీసుకొచ్చారు. మోదుకూరి జాన్సన్‌పై 'చెరగని జ్ఞాపకాలు' రచించారు.

చీరాల మున్సిపల్ కమిషనర్‌గా రామచంద్రారెడ్డి




చీరాల: చీరాల మున్సిపాలిటి కమిషనర్‌గా కె.రామచంద్రారెడ్డిని మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు నియమించారు. చీరాల మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న సీహెచ్ మల్లేశ్వరరావు మెడికల్ లీవ్ లో ఉన్నారు. మున్సిపల్ డీఈ పి.ఐసయ్య కమిషనర్‌గా ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వహించారు. నూతన కమిషనర్‌గా కె.రామచంద్రారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. 2020లో ఈయన చీరాల మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు.

ఐదుగురు విద్యార్థులపై మాల్ ప్రాక్టీసు కేసులు

107 ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో విస్తృత తనిఖీలు

గుంటూరు ఎడ్యుకేషన్: సీనియర్ ఇంటర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీసుకు పాల్పడిన ఐదుగురు విద్యార్థులపై కేసులు నమోదయ్యాయి. శుక్రవారం ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మ్యాథ్స్ పేపర్–2బీ, జువాలజీ, హిస్టరీ పేపర్–2 పరీక్షలు జరిగాయి. గుంటూరు గోరంట్లలోని శ్రీచైతన్య జూనియర్ పరీక్షా కేంద్రంలో ముగ్గురు విద్యార్థులతో పాటు చిలకలూరిపేటలోని ఏఎంజీ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో కాపీయింగ్‌కు పాల్పడిన ఒక విద్యార్థిని గుర్తించిన అధికారులు మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు చేశారు. గుంటూరు నవభారత్‌నగర్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని డీవీఈవో జె.పద్మ ఆకస్మికంగా తనిఖీ చేసిన సమయంలో ఒక విద్యార్థి స్లిప్పులను కలిగిఉండటాన్ని గుర్తించారు. దీంతో సదరు విద్యార్థిపై మాల్ ప్రాక్టీసు కేసు నమోదుతో పాటు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇన్విజిలేటర్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చారు. శుక్రవారం జరిగిన పరీక్షలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 134 కేంద్రాల పరిధిలో కేటాయించిన 40,764 మంది విద్యార్థుల్లో 39,839 మంది హాజరయ్యారు. అత్యధికంగా 107 పరీక్షా కేంద్రాల్లో పరిశీలకులు, స్క్వాడ్స్ విస్తృత తనిఖీలు నిర్వహించారు.

యార్డులో 87,530 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 81,449 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 87,530 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.25,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.27,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,200 నుంచి రూ.13,000 వరకు ధర దక్కింది. యార్డులో ఇంకా 79,416 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

కడలిపుత్రుల తోడుగా..

సాగరమిత్రలు!

- తీరప్రాంతాల్లో సాగరమిత్రల నియామకం
- నూతనంగా 23 పోస్టులు మంజూరు
- డిగ్రీ అర్హతగా నియామకానికి కసరత్తు
- రెండు రోజులుగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్
- మత్స్యకారుల అభ్యున్నతి కోసం పనిచేయనున్న సాగరమిత్రలు





సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం హాజరైన అభ్యర్థులు (ఇన్‌సెట్‌లో) జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలోని సముద్రతీరంలో సాగరమిత్రల నియామకానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మత్స్యకారులకు మార్గనిర్దేశకులుగా సాగరమిత్రలు పనిచేయనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వం వీరిని నియమిస్తోంది. వీరు ఐదేళ్ల పాటు విధుల్లో ఉంటారు. సముద్రతీర ప్రాంతాలైన వేటపాలెం, చీరాల, చినగంజాం, బాపట్ల, కర్లపాలెం, నిజాంపట్నం, రేపల్లె మండలాల పరిధిలోని 47 ల్యాండింగ్ సెంటర్ల పరిధిలో సాగరమిత్రలను నియమిస్తారు. డిగ్రీ అర్హతగా వీరి నియామకం జరుగుతుంది. మత్స్యకార గ్రామాల పరిధిలోని నిరుద్యోగులు ఈ ఉద్యోగాలకు అర్హులు. 2019–20లో ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజన (పీఎంఎస్ఎస్‌వై) పథకాన్ని తొలిసారి ప్రవేశపెట్టారు. అప్పట్లో తీర ప్రాంతానికి చెందిన 17 మంది సాగరమిత్రలను నియమించారు. నెలకు రూ.15 వేలు జీతం ఇస్తున్నారు. తొలుత పదిహేడు మందిని నియమించగా వీరిలో ఇద్దరు ఉద్యోగం మానివేశారు. 15 మంది ఇప్పటికీ ఉద్యోగం చేస్తున్నారు.

కొత్తగా మరో 23 మంది సాగరమిత్రలు..

కొత్తగా ఈ పథకం కింద ప్రభుత్వం 23 మందిని సాగరమిత్రలుగా నియమించాలని నిర్ణయించింది. దీనిపై ఇటీవల నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో జిల్లాలోని తీరప్రాంత మండలాల పరిధిలో డిగ్రీ చదివిన 132 మంది దరఖాస్తు చేశారు. వీరిలో 94 మంది అర్హత సాధించారు. శుక్ర, శనివారం జిల్లా కేంద్రంలోని మత్స్యశాఖ కార్యాలయంలో అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతోంది. ప్రక్రియ ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. వీరిలో 23 మందిని సాగరమిత్రలుగా నియమించనున్నారు.

సాగరమిత్రల విధులు ఇలా..

జిల్లాలోని ఏడు మండలాల పరిధిలో 74 కిలోమీటర్ల మేరా తీరప్రాంతం ఉంది. 57 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. 53,515 మంది మత్స్యకారులు ఉండగా, 14,387 మంది యాక్టివ్ మత్స్యకారులుగా ఉన్నారు. 3099 బోట్లు ఉన్నాయి. సాగరమిత్రలు సముద్రంలో వేటసాగించే మత్స్యకారులకు మార్గనిర్దేశకులుగా విధులు నిర్వహిస్తారు. ప్రతి రోజు సముద్రంలోకి వెళ్లే బోట్లు, వేటకు వెళ్లే మత్స్యకారుల సంఖ్యతో పాటు తిరిగివచ్చే బోట్లు, మత్స్యకారుల వివరాలను ఎప్పటికప్పుడు లాక్‌బుక్‌లో నమోదు చేస్తారు. వేటలోపడే చేపల రకాలను గుర్తించి తద్వారా మత్స్య సంపద వివరాలను నమోదు చేస్తారు. మత్స్యకారులు వేట సమయంలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలను వివరిస్తారు. ప్రభుత్వపరంగా మత్స్యకారులకు అందాల్సిన పథకాలను వివరించడంతో పాటు వారు వాటిని పొందేలా చర్యలు చేపడతారు. మొత్తంగా సాగరమిత్రలు మత్స్యకారులు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా పనిచేసి మత్స్యకారుల సంక్షేమాభివృద్ధి కోసం పాటుపడతారు.

మత్స్యకారులకు అండగా...



సాగరమిత్రలు మత్స్యకారులు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉంటారు. మత్స్యకారులకు నిత్యం, సలహాలు, సూచనలు అందజేస్తారు. వేట సమయంలో జాగ్రత్తలు తెలియజేస్తారు. తుపాన్ సమయంలో రక్షణకు తోడుగా ఉంటారు. మత్స్యకారుల సంక్షేమాభివృద్ధి కోసం పనిచేస్తారు. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం ద్వారా ప్రభుత్వం వీరిని నియమిస్తోంది. ప్రస్తుతం 23 మంది సాగరమిత్రల నియామకం జరుగుతోంది.

– పి.సురేష్, జిల్లా మత్స్యశాఖాధికారి

పశువులకు గాలికుంటు నివారణ టీకా వేయించాలి

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



గాలికుంటు వ్యాధి టీకా వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

బాపట్ల: పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకా వేయించాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పశుపోషకులకు సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం గాలికుంటు వ్యాధి నివారణ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 24వ తేదీ వరకు వ్యాధి నివారణ టీకా వేయించాలని సూచించారు. జిల్లాలో 25 మండలాల్లో 75 బృందాలను ఏర్పాటు చేయగా, వాటిలో 411 మంది సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఇప్పటికే 3,38,650 డోసుల టీకా పశువైద్యశాలలకు అందించామని జేడీఏ అబ్దుల్‌సత్తార్ తెలిపారు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ కె.శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

జైళ్ల శాఖలో 30 శాతం ఖాళీల భర్తీకి ప్రతిపాదనలు

- రాష్ట్ర వ్యాప్తంగా 28 పెట్రోల్ బంకులు ఏర్పాటు
- జైళ్ల శాఖ ఐజీ హసన్ రిజా



సత్తెనపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా జైళ్ల శాఖలో 30 శాతం ఖాళీలు ఉన్నాయని, వాటి భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని జైళ్ల శాఖ డీజీ హసన్ రిజా తెలిపారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి సబ్‌జైలులో జైళ్ల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జైళ్ల శాఖ ఆధ్వర్యంలో 28 పెట్రోల్ బంకులు ఏర్పాటు చేశామని, వీటిలో 16 పూర్తి కాగా 12 వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. ఓపెన్ ప్రిజనర్ కింద పెట్రోల్ బంకుల్లో పనిచేసేందుకు ఐదేళ్ల పైబడి శిక్ష అనుభవిస్తున్న సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను తీసుకుంటున్నామన్నారు. జైళ్లలో ఖైదీలకు ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తున్నామని చెప్పారు. రాజమండ్రి సబ్‌జైల్లో కూరగాయలు సాగు చేపట్టడంతో రూ.30 లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు. జైళ్లలో అనేక సంస్కరణలు అమలవుతున్నాయన్నారు. సత్తెనపల్లి సబ్ జైలులో రూ.9 లక్షలతో టాయిలెట్ల నిర్మాణం జరుగుతోందన్నారు. సబ్‌జైల్లో తనిఖీలు చేసి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీఐజీ వరప్రసాద్, గుంటూరు జైళ్ల శాఖ అధికారి వీరేంద్రప్రసాద్, సత్తెనపల్లి సబ్‌జైలు సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్



సత్తెనపల్లి: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. సత్తెనపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, రఘురాంనగర్‌లోని బీసీ బాలికల వసతి గృహాన్ని శుక్రవారం రాత్రి ఆయన సందర్శించారు. సిలబస్ ఎక్కడ వరకు పూర్తయింది, నోట్ పుస్తకాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. సత్తెనపల్లి ఆర్డీవో బీఎల్ఎస్ రాజకుమారి, తహసీల్దార్ కె.నగేష్, మండల విద్యాశాఖ అధికారి ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు విస్తృత అవకాశాలు

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరువెస్ట్: జిల్లాలో పరిశ్రమలను ఏర్పాటుచేసే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పూర్తి సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన ఇండస్ట్రియల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను అధికారులు ప్రభుత్వ పాలసీ ప్రకారం పరిశీలించి ఆమోదించాలన్నారు. చిన్న చిన్న సమస్యలు ఏర్పడితే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. బ్యాంకర్లు కూడా పరిశ్రమల స్థాపనకు మరిన్ని రుణాలు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రుణాలు, ఇన్‌సెంటివ్స్ ద్వారా ఆర్థిక సహకారం అందిస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి పరిశ్రమల ఏర్పాటుకు 508 దరఖాస్తులు అందాయని, వీటిలో సమాచారం పూర్తిస్థాయిలో క్రోడీకరించని 368 దరఖాస్తులు అందాయన్నారు. వీటిలో పూర్తి సమాచారం పొందుపరిచి దరఖాస్తుదారులు రెండు వారాల్లో ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేయాలన్నారు. సబ్సిడీలో పొందే క్రమంలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు. సమావేశంలో లీడ్‌బ్యాంక్ మేనేజర్ ఈదర రాంబాబు, జిల్లా పరిశ్రమల శాఖ డీఎం విజయరత్నం, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ గోపికృష్ణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'ఉద్యాన' రైతన్నకు బాసట!



కొల్లిపరలో నిర్మాణం పూర్తయిన కలెక్షన్ సెంటర్

కొరిటిపాడు(గుంటూరు): వ్యవసాయ రంగం అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రైతులకు అండగా నిలుస్తోంది. పెట్టుబడి సాయం అందజేస్తున్న ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు, ఉచిత పంటల బీమా తదితర పథకాలు అందజేస్తోంది. లాభసాటి సాగుపై ఆర్‌బీకేల సిబ్బంది రైతులకు సలహాలు, సూచనలు అందజేస్తూ చైతన్య పరుస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యాన సాగును ప్రోత్సహిస్తూ రైతన్నకు బాసటగా నిలుస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పండ్లు, కూరగాయలు గ్రేడింగ్, ప్యాకింగ్ చేసుకునేందుకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో కలెక్షన్ సెంటర్ (పంట సేకరణ కేంద్రాలు) ఏర్పాటు చేస్తోంది. గుంటూరు జిల్లాకు 12 కలెక్షన్ సెంటర్లు మంజూరు కాగా ఇప్పటి వరకు కొల్లిపర, నందివెలుగు, కొత్తమల్లాయపాలెం, నుదురుపాడులో నిర్మాణాలు పూర్తయ్యాయి. ప్రత్తిపాడులో నిర్మాణం పూర్తయ్యి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. మిగిలిన ఏడు చోట్ల వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నాయి. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు యూనిట్లు పొందే అర్హత కల్పించారు. అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్‌తో కలెక్షన్ సెంటర్ నిర్మాణానికి ఉద్యాన శాఖ నిధులు మంజూరు చేస్తుంది. ఒక్కో యూనిట్ వ్యయం రూ.15 లక్షలు కాగా రైతుల వాటా కేవలం రూ.3.75 లక్షలు మాత్రమే చెల్లించాల్సిఉంటుంది. మిగిలిన రూ.11.25 లక్షలు ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుంది. ఒక్కో రైతు ఉత్పత్తిదారుల సంఘంలో 100 నుంచి 500 మంది సభ్యులుగా ఉన్నారు.

తీరనున్న ఇబ్బందులు..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతులు ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఏడాదికేడాది ఉద్యాన పంటల సాగు పెరుగుతోంది. మిరప, అరటి, పసుపు, పండ్లు, కూరగాయల పంటల సాగు పెరుగుతోంది. జిల్లాలో మిరప 20 వేల హెక్టార్లు, పసుపు 1,600 హెక్టార్లు, పండ్లు 3,600 హెక్టార్లు, పూలు 500 హెక్టార్లు సాగు చేస్తున్నట్లు అధికారుల అంచనా. కూరగాయల పంటలు 3,500 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. పంటల దిగుబడి సమయంలో సరైన ధరలు లేక రైతులు నష్టపోతున్నారు. దిగుబడులు నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో నష్టాలు చవిచూడాల్సివచ్చేది. ఇలాంటి సమస్యల నుంచి గట్టెక్కించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతోంది. కలెక్షన్ సెంటర్లలో రైతులు పండించిన కూరగాయలు, పండ్లు తదితరాల వాటిని నిల్వ చేసుకొని ధర లభించిన సమయంలో మార్కెటింగ్ చేసుకునే వెసులుబాటు కల్పించనుంది. దిగుబడులు గ్రేడింగ్, ప్యాకింగ్ చేసుకొని మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించుకోవచ్చు. దీంతో గతంలో పడిన ఇబ్బందులు తొలగనున్నాయి. 2,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో షెడ్ నిర్మించి రైతులకు అనువుగా సౌకర్యాలు కల్పిస్తున్నారు.

ప్రభుత్వ సహకారం అభినందనీయం..



రైతులందరికీ అందుబాటులో రవాణ సౌకర్యం ఉండేలా కలెక్షన్ సెంటర్ నిర్మించాం. గ్రూపు సభ్యుల సహకారంతో పాటు ప్రభుత్వం పెద్ద మొత్తంలో సబ్సిడీ కల్పించడంతో కలెక్షన్ సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చాం. రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న సహకారం అభినందనీయం.

– ఎన్.కుటుంబరెడ్డి, శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు, కొల్లిపర

ఇక నష్టాలు ఉండవు..

ఉద్యాన పంటల దిగుబడుల సమయంలో ధరలు అనుకూలించక చాలా ఇబ్బందులు పడ్డాం. తప్పని పరిస్థితుల్లో నష్టానికే అమ్ముకున్నాం. దిగుబడులు నిల్వ చేసుకునేందుకు కలెక్షన్ సెంటర్ ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఇక ముందు నష్టాలు దాదాపు ఉండవు. ప్రత్యేకించి కూరగాయలు సాగు చేసే సన్న, చిన్నకారు రైతులకు బాగుంటుంది.

–ఎం.వెంకటేశ్వరరెడ్డి, రైతు, ప్రత్తిపాడు

కలెక్షన్ సెంటర్లు ఉపయోగకరం



ఉద్యాన పంటల ఉత్పత్తుల నిల్వ, గ్రేడింగ్, మార్కెటింగ్ చేసుకునేందుకు ఏర్పాటు చేయనున్న కలెక్షన్ సెంటర్లు రైతులకు చాలా ఉపయోగకరం. ఇప్పటికే జిల్లాలో కొల్లిపర, నందివెలుగు, కొత్తమల్లాయపాలెం, నుదురుపాడులో సెంటర్లు నిర్మించి ప్రారంభించాం. త్వరలో ప్రత్తిపాడులో నిర్మిస్తున్న కలెక్షన్ సెంటరును ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ముందుకు వస్తే మరిన్ని మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఉద్యాన రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఎస్.సుజాత, జిల్లా ఉద్యాన అధికారి

మిత్రులను మింగేసిన మృత్యువు

- చెరువులో ఈతకు దిగిన ఇద్దరు స్నేహితులు దుర్మరణం
- గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది సాయంతో మృతదేహాల వెలికితీత
- ప్రత్తిపాడులో విషాదం



ప్రసన్నకుమార్ (ఫైల్)



నాగుల్‌మీరా (ఫైల్)



చీలి ప్రసన్నకుమార్ మృతదేహం



షేక్ నాగుల్‌మీరా మృతదేహం

ప్రత్తిపాడు: సరదాగా చెరువు గట్టున సేదతీరుతూ కాలక్షేపం చేద్దామనుకున్న ఆ ఇద్దరు స్నేహితులను మృత్యువు వెంటాడింది. ఈత కొట్టేందుకు చెరువులోకి దిగిన ఇద్దరు మిత్రులను మృత్యువు కబళించిన విషాద ఘటన ప్రత్తిపాడులో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రత్తిపాడుకు చెందిన చీలి ప్రసన్నకుమార్ (25), షేక్ నాగుల్ మీరా (22) స్నేహితులు. ఇద్దరూ శుక్రవారం ఉదయం స్థానిక రక్షిత మంచినీటి చెరువులో ఈతకు దిగారు. కొద్ది క్షణాలకే చెరువులో కూరుకుపోయి మునిగిపోయారు. అదే సమయంలో అటువైపుగా పొలానికి వెళుతున్న ఎం.పూర్ణచంద్రరావు వారిని గమనించి విషయాన్ని ప్రసన్నకుమార్ కుటుంబ సభ్యులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్రకుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. స్థానిక ఈతగాళ్లను చెరువులోకి దింపి గాలించారు. ఫలితం లేకపోవడంతో ఫైర్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలకు సమాచారమిచ్చారు. సుమారు మూడు గంటల పాటు శ్రమించి గజ ఈతగాళ్ల సాయంతో ఫైర్ సిబ్బంది, పోలీసులు మృతదేహాలను బయటకు తీశారు. ఈ మేరకు మృతుల కుటుంబీకులు షేక్ మున్ని, సీహెచ్ శివకుమారి ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గర్భిణికి పుట్టెడు శోకం..

భర్త దుర్మరణం భార్యకు పుట్టెడు శోకాన్ని మిగిల్చింది. మృతుడు ప్రసన్నకుమార్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి కొన్నేళ్ల కిందట వివాహం అయ్యింది. కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం భార్య మూడవ నెల గర్భవతి. గురువారం ఉదయం డ్యూటీకి వెళ్లి వస్తానని ప్రసన్నకుమార్ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం ప్రసన్నకుమార్ ఇంటికి వస్తాడని ఎదురుచూస్తుండగా, అతని మరణ వార్త రావడంతో భార్య గుండెలవిసేలా రోదిస్తోంది.

అమ్మను ఒంటిరిని చేసి..

షేక్ అబ్దుల్ గఫార్, మున్నికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. నాగుల్‌మీరా ఒక్కడే కుమారుడు. తండ్రి అబ్దుల్ గఫార్ పదిహేడేళ్ల కిందట మరణించడంతో తల్లీ కొడుకులిద్దరే ఉంటున్నారు. నాగుల్‌మీరా బేల్దారు పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. చేతికొచ్చిన కొడుకు అర్ధంతరంగా మరణించడంతో ఆ తల్లి ఒంటిరి అయ్యింది. ఆమెకు అంతేలేని ఆవేదనను మిగిల్చింది. బిడ్డా నన్ను వదిలి వెళ్లావా.. అంటూ ఆ తల్లి రోదనలు చూపరులకు కంటతడిపెట్టించాయి.

పీఏసీఎస్ సీఈఓ సస్పెన్షన్

నిజాంపట్నం: నిజాంపట్నం పీఏసీఎస్ సీఈవోగా పనిచేస్తున్న మోపిదేవి నాగేశ్వరరావు అవకతవకలకు పాల్పడినందున 6 నెలల పాటు విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు పీఏసీఎస్ చైర్మన్ మరకా శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం నిజాంపట్నంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 2021–22 సంవత్సరానికి సంబంధించి ఇన్‌కంట్యాక్స్ రిటర్న్‌ను పంపకపోవడం, 2018–19 నుంచి ఐటీ రిటర్న్‌ను సంఘం పేరున ఉన్న పాన్‌కార్డుపై కాకుండా సంఘ అధ్యక్షుడి పాన్‌కార్డు ద్వారా పంపడం, సంఘ సభ్యులు కొంత మందివి పాస్‌బుక్‌లు పోగొట్టడం వంటి పలు అవకతవకలపై చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

రాగిజావ, చిక్కీ పంపిణీ వేళల్లో మార్పులు

ఉదయం 8:45 గంటలకు బదులుగా 10:35 నుంచి పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా అందజేస్తున్న రాగిజావ, చిక్కీ పంపిణీ వేళల్లో మార్పులు చేస్తూ మిడ్ డే మీల్స్ డైరెక్టర్ నిధిమీనా ఉత్తర్వులు విడుదల చేసినట్లు డీఈవో పి.శైలజ శుక్రవారం తెలిపారు. ఈ నెల 21న ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన రాగిజావ పంపిణీ ప్రక్రియ వారంలో మూడు రోజుల పాటు ప్రతి మంగళ, గురు, శనివారాల్లో ఉదయం 8.45కల్లా అందజేయాలని ఇచ్చిన ఉత్తర్వులను సవరించినట్లు పేర్కొన్నారు. ఇక నుంచి ఫౌండేషన్ స్కూళ్లలో ఆయా రోజుల్లో ఉదయం 10:35కు, హైస్కూళ్లలో ఉదయం 10:45కు రాగిజావ పంపిణీ చేయాలని తెలిపారు. చిక్కీని మధ్యాహ్న భోజనం తరువాత విద్యార్థులకు అందజేయాలని డీఈవో శైలజ హెచ్ఎంలను ఆదేశించారు.

ఉర్దూ పాఠశాలల పనివేళల్లో మార్పులను అమలు చేయాలి..

రంజాన్ మాసం సందర్భంగా ఉర్దూ మీడియం పాఠశాలల పనివేళల్లో మార్పులు చేస్తూ ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులను అమలుపరచాలని డీఈవో శైలజ పేర్కొన్నారు. ఆయా పాఠశాలలు ఏప్రిల్ 22 వరకు ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పని చేసేలా పర్యవేక్షించాలని డీవైఈవోలు, ఎంఈవోలతో పాటు ఉర్దూ డీఐని ఆదేశించారు.

సెల్‌ఫోన్ పోతే వాట్సాప్‌లో సమాచారం ఇవ్వండి

- ఎస్పీ వకుల్ జిందాల్
- 645 మంది బాధితులకు సెల్‌ఫోన్లు అందజేత


సెల్‌ఫోన్లు అందుకున్న వారితో ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల: సెల్‌ఫోన్ పోతే వెంటనే వాట్సాప్ నంబరు 8978777833కు ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ చేసిన ప్రయోగం ఫలించింది. జిల్లాలో ఫోన్లు పోయిన బాధితుల వాట్సాప్ ఫిర్యాదులతో 645 మొబైల్ ఫోన్లు గుర్తించి శుక్రవారం బాధితులకు అందించారు. ఈమేరకు శుక్రవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రపంచం గురించి తెలుసుకోవడానికి, ప్రపంచానికి పరిచయం కావడానికి అర చేతిలో ఉండే స్మార్ట్ ఫోన్ దోహదపడుతుందని తెలిపారు. స్మార్ట్‌ఫోన్‌ల ఆవశ్యకత ప్రస్తుత సమాజంలో పెరిగిపోయిందని, ప్రతి ఒక్కరి జీవితంలో మొబైల్ అతి ముఖ్యమైన వస్తువుగా మారిందన్నారు. స్మార్ట్‌ఫోన్‌లలో ముఖ్యమైన సమాచారాన్ని, వ్యక్తిగత సమాచారాన్ని పొందుపరుస్తూ కోవటంతో ఫోను పారపాటుగా పోగొట్టుకుంటే చాలా ఇబ్బందులుపడుతారని చెప్పారు. ఒకప్పుడు మొబైల్ ఫోన్‌లు పోగొట్టుకుంటే పోలీస్ స్టేషన్ లలో పిర్యాదు చేయడానికి సరైన పద్ధతి ఉండేదికాదని, ఇప్పుడు ప్రత్యేకంగా వాట్సాప్ ఫిర్యాదును పొందుపరిచామని తెలిపారు. మొబైల్ మిస్సింగ్ ఫిర్యాదులు స్వీకరించడం కోసం ఐటీ కోర్ సిబ్బందితో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో మొబైల్ ఫోన్ పోగోట్టుకున్న బాధితుల కోసం ప్రత్యేక సర్వీస్ పిటిషన్లు అందుబాటులో ఉంచటం జరిగిందన్నారు. ఈ మేరకు జనవరి నుంచి వచ్చిన ఫిర్యాదులు మేరకు ఫోన్లు ట్రేసింగ్ చేయటం జరిగిందని తెలిపారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ మహేష్, సీఐ పి.కృష్ణయ్య ఉన్నారు.

ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డులకు దరఖాస్తులు

సత్తెనపల్లి: మహిళల దినోత్సవం పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత -2023 అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి శుక్రవారం తెలిపారు. పారిశుద్ధ్యం, ఘన పదార్థాల నిర్వహణలో భాగంగా వ్యక్తిగత, స్వయం సహాయక, చిన్న తరహా, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకుల శుభ్రత, వ్యర్థాల శుద్ధికరణ, చెత్త సేకరణ, చెత్తతో కళాకృతుల తయారీ, తడి చెత్త వినియోగం, వంటి అంశాలపై కృషి చేస్తున్న మహిళలు ఇందుకు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 27 లోగా సత్తెనపల్లి పురపాలక సంఘ పరిధిలోని వార్డు సచివాలయాలలో వార్డు శానిటేషన్ సెక్రటరీలకు దరఖాస్తులు అందజేయాలని కోరారు. అవార్డుకు ఎంపికైన మహిళలకు జూన్ 5వ తేదీన నిర్వహించనున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో పురస్కారాలు అందజేస్తారని తెలిపారు. ఇతర వివరాలకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథి 9849907932లో సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ భవనాలను వేగంగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, వేదికపై జేసీ డాక్టర్ శ్రీనివాసులు

బాపట్ల: ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణ పనులు సత్వరమే పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ ఆదేశించారు. స్థానిక స్పందన సమావేశ మందిరంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం ఆమె సమీక్షించారు. ఉపాధి హామీ పథకం నిధుల అనుసంధానంతో చేపడుతున్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణంలో పురోగతి కనిపించాలని కలెక్టర్ చెప్పారు. బాపట్ల జిల్లాకు 401 గ్రామ సచివాలయాల భవనాలు మంజూరు కాగా ఇప్పటికీ 13 భవనాల నిర్మాణం మొదలు కాలేదని పేర్కొన్నారు. మరో 15 పునాది స్థాయికి దిగువన ఉండగా, మిగిలిన 12 భవనాల నిర్మాణాలకు ఏజెన్సీలకు కేటాయించే ప్రక్రియలో ఉండడంతో అధికారులపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. 315 రైతు భరోసా కేంద్రాలు మంజూరు కాగా 56 భవనాల నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉండడంపై ఆరా తీశారు. 343 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు మంజూరు కాగా 75 పెండింగ్‌లో ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ భవనాల నిర్మాణం ద్వారా అభివృద్ధి పనులు జరగడంతో పాటు నిరుపేదలకు ఉపాధి కల్పించే అంశాలను అధికారులు విస్మరించడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు.

గడప గడపకు మన ప్రభుత్వంలో గుర్తించిన పనులు 497 మంజూరు కాగా, 49 పనులు నేటికీ ప్రారంభించకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అద్దంకి, బాపట్ల రూరల్, పర్చూరు మండలాలలో పనుల పురోగతి కనిపించకపోవడంతో అధికారులను నిలదీశారు. ప్రజల అవసరాలను గుర్తించలేక పోతే అధికారులు ఎలా పనిచేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు.

స్పందన అర్జీలు పరిష్కారించాలి

పునరావృతమవుతున్న స్పందన అర్జీలను అధికారులు గడువు లోగా పరిష్కరించకపోతే ప్రభుత్వం విధులను ఎలా నిర్వహిస్తారని కలెక్టర్ విజయకృష్ణన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలలోనే 34 అర్జీలు పునరావృతమయ్యాయని చెప్పారు. ఇటీవల 1,474 అర్జీలు అధికారులు పరిష్కరించినప్పటికీ, 46 అర్జీలను క్రమ పద్ధతిలో ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించలేదని చెప్పారు. 399 అర్జీలు స్పందన పోర్టల్, జగనన్నకు చెబుతాం వెబ్ సైట్లో వచ్చాయన్నారు. వీటిని సక్రమంగా పరిష్కరించలేక పోతే మీకిచ్చే వేతనాలు వ్యర్థమవుతున్నాయని పేర్కొన్నారు.

గృహాల నిర్మించుకోని జాబితా ఇవ్వండి..

జగనన్న కాలనీలలోని లబ్ధిదారులు తమ గృహాలను ఎందుకు నిర్మించుకోవడం లేదో అధికారులు సర్వే నిర్వహించి స్పష్టమైన నివేదిక ఇవ్వాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు ప్రత్యేక బాధ్యత తీసుకొని చిత్తశుద్ధితో సర్వే నిర్వహించాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో వేమూరు నియోజకవర్గంలోని అధికారుల పనితీరు సరిగా లేదని మందలించారు. అధికారులు నిబద్ధతతో పనిచేస్తే గృహ నిర్మాణాలలో పురోగతి కనిపిస్తుందన్నారు.

రాజకీయ ఒత్తిడిలను పక్కనపెట్టి లబ్ధిదారులకు అన్ని విధాలుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూర్చడమే అధికారుల లక్ష్యమని చెప్పారు. ప్రధానంగా జగనన్న కాలనీలలో తాగునీరు, విద్యుత్ వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందకపోతే అధికారులే బాధ్యులవుతారని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా 174 వలంటీర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, తక్షణమే వాటిని భర్తీ చేసి ఆ ప్రాంతాలలో ప్రభుత్వ సేవలు అందేలా చూడాలని కోరారు. ముఖ్యంగా గర్భిణులకు పోషకాహారం అందిస్తూ.. వారిలో రక్తహీనత, పోషణ లోపం నివారించే ప్రక్రియను సమర్థంగా చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి దాతలు రావడం అభినందనీయం


పూజల్లో పాల్గొన్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, దాత సింహాద్రి వెంకట రామారెడ్డి తదితరులు

కాజ(మంగళగిరి): ప్రాచీన ఆలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని టీటీడీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కొనియాడారు. నగర పరిధిలోని కాజలోని కోదండ రామాలయం, అగస్త్యేశ్వర స్వామి ఆలయాల విమాన శిఖర ప్రతిష్టా మహోత్సవానికి శుక్రవారం ముఖ్య అతిథిగా విచ్చేసిన వైవీ సుబ్బారెడ్డి స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రాచీన ఆలయాల జీర్ణోద్ధారణకు దాతలు సింహాద్రి వెంకట రామారెడ్డి దంపతులు పూనుకోవడం ప్రశంసనీయమన్నారు. ప్రాచీన ఆలయాల అభివృద్ధిలో భాగంగా టీటీడీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని మరిన్ని ఆలయాలను అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అందులో భాగంగా కాజ ఆలయాలకు తమ వంతు సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి విమాన శిఖర ప్రతిష్ట, జీవ కళాన్యాసం, మహాకుంభాభిషేకం, పూర్ణాహుతి, శాంతి కల్యాణం నిర్వహించారు. పూజల్లో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, సింహాద్రి వెంకట రంగారెడ్డి దంపతులు, ఆర్ల రామయ్య, కమ్మెల సుబ్బారావు, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు. భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేశారు.

నూతన అంశాలు వెలుగులోకి రావాలి

వీసీ ఆచార్య రాజశేఖర్

ఏఎన్‌యూ: తెలుగు భాషా విభాగం ఆధ్వర్యంలో పరిశోధనలు, సదస్సుల ద్వారా తెలుగు సాహిత్యం, కవులు, రచయితలకు సంబంధించిన నూతన అంశాలు వెలుగులోకి తేవాలని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తెలుగు, ప్రాచ్య భాషా విభాగం ఆధ్వర్యంలో 'అనిశెట్టి- పినిశెట్టి సాహిత్యం- సామాజిక దృక్కోణం' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సును శుక్రవారం ప్రారంభించారు. వీసీ ప్రసంగిస్తూ తెలుగు సాహిత్యం ద్వారా సామాజికంగా ఎంతో మార్పుకు కృషి చేసిన అనిశెట్టి- పినిశెట్టిలకు సంబంధించిన అంశాలపై సదస్సు నిర్వహించడం వలన వారి భావజాలాన్ని సమాజానికి మరింత చేరువ చేసినట్లవుతుందన్నారు. వారి సాహిత్య విలువలపై ఈ సదస్సులో కూలంకుషంగా చర్చించాలన్నారు. ఏఎన్‌యూ రెక్టార్ పి.వరప్రసాద్ మూర్తి ప్రసంగిస్తూ సామాజిక అంశాలు, విలువల కోసం నిరంతరం కృషి చేసిన మహనీయులపై జాతీయస్థాయిలో చర్చ జరగడం అభినందనీయమని చెప్పారు. వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ స్వరూప రాణి మాట్లాడుతూ సమాజానికి వీరి నాటకాలు, సినిమాలు, వాటిలోని పాత్రల సృష్టి ద్వారా ఉన్నత విలువల్ని అనిశెట్టి సుబ్బారావు, పినిశెట్టి శ్రీరామమూర్తి సమాజానికి అందించారన్నారు. పినిశెట్టిపై కీలక ప్రసంగం చేసిన మద్రాస్ యూనివర్సిటీ తెలుగు విభాగాధిపతి విస్తాలి శంకరరావు మాట్లాడుతూ నాటి నాటక, సినీ రచనలు, వాటి పాత్ర చిత్రాల్లోనూ నైతికత ప్రధానంగా ఉండేదని వివరించారు. కానీ నేడు అది లోపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పినిశెట్టి ఆనాడే సమాజానికి మంచి విలువలతో కూడిన సాహిత్యాన్ని అందించారని అన్నారు. అనిశెట్టిపై పి.వి.సుబ్బారావు కీలక ఉపన్యాసం చేస్తూ నాటక, సినీ రచనల్లో ఎంతో వైవిధ్యం ఉందన్నారు. అనిశెట్టి కుమారుడు, విశ్రాంత ఆంగ్ల అధ్యాపకుడు శాంత కుమార్ ప్రసంగిస్తూ తన తండ్రిలో ఎంతో ఉన్నత విలువలు ఉన్నాయని అవి తాను స్వయంగా చూశానన్నారు. సదస్సులో డైరెక్టర్ ఆచార్య కృష్ణారావు, తెలుగు విభాగాధిపతి డాక్టర్ మాధవి ప్రసంగించారు.


దంత వైద్యుడు మృతి

అద్దంకి రూరల్: అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో దంతవైద్యుడిగా పనిచేస్తున్న ఎస్ శ్రీనివాసరెడ్డి(54) శుక్రవారం రాత్రి పట్టణంలోని ఓ లాడ్జిలో మృతి చెందాడు. అందిన వివరాల మేరకు.. గత కొంతకాలం నుంచి అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో దంతవైద్యుడిగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి ఒక్కడిగానే స్థానిక ఓ లాడ్జిలోని గదిలో అద్దెకు ఉంటున్నాడు. ఈక్రమంలో శుక్రవారం రాత్రి గదిలో అపస్మారక స్థితిలో పడిఉన్న దంతవైద్యుడిని చూసి లాడ్జి సిబ్బంది వైద్యశాల సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నెల్లూరు చెందిన వ్యక్తి కాగా భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సమాచారం.

వృద్ధుడి మృతదేహం లభ్యం

మేదరమెట్ల: ఓ వృద్ధుడి మృతదేహం శుక్రవారం మేదరమెట్ల సమీపంలోని ఉత్తర బైపాస్ పాతగుంటూరు రోడ్డు, బాయిల్డ్ రైస్‌మిల్లు వద్ద కనిపించింది. స్థానికుల సమాచారంతో ఎస్‌ఐ శివకుమార్ ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాలను సేకరించారు. ఎస్‌ఐ అందించిన వివరాలు మేరకు.. అద్దంకి మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన బీమనాథం కోటిరెడ్డి(72) భార్య రెండన్నర సంవత్సరాల కిందట మృతి చెందింది. ప్రభుత్వం అందిస్తున్న వృద్ధాప్య పింఛన్‌తో కాలం వెళ్లదీస్తున్నాడు. ఈక్రమంలో కోటిరెడ్డి ఈనెల 5వ తేదీన పింఛన్ డబ్బులు తీసుకుని ఇంటినుంచి బయటకు వెళ్లాడు. నాలుగు, ఐదు రోజుల కిందట బంధువుల ఇంటి నుంచి వచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు. శుక్రవారం ఉదయం మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుమారుడు మల్లికార్జునరెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఏపీ టూరిజం మాజీ డైరెక్టర్ రాజేశ్వరి మృతి



చినగంజాం: రాష్ట్ర ఏపీ టూరిజం మాజీ డైరెక్టర్ మాగులూరి రాజేశ్వరి(63) గురువారం మృతి చెందారు. బాపట్ల జిల్లా చినగంజాం మండలంలోని నీలాయపాలెం గ్రామ పంచాయతీకి చెందిన రాజేశ్వరి ఇటీవల నేపాల్ తీర్థయాత్రకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఉత్తరప్రదేశ్‌లోని ఖరగ్‌పూర్‌లో రైలులో ఎక్కిప్రయాణం చేస్తుండగా శ్వాస సంబంధ సమస్య తలెత్తింది. రెండు గంటల ప్రయాణం అనంతరం బారాబంకి అనే గ్రామంలో రైల్వే స్టేషన్‌లో దించి స్థానిక వైద్యశాలలో పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమె ఆ పాటికే ఊపిరి ఆడక పోవడంతో మరణించినట్లు ధ్రువీకరించారు. ఆమెకు భర్త మాగులూరి ఆంజనేయులు రైతు కాగా, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారిరువురికి వివాహాలు అయ్యాయి. ఆమె కొంత కాలం ఏపీ టూరిజం డైరెక్టర్‌గా పదవిని నిర్వహించారు. ఆమెకు మహిళా నాయకురాలిగా మంచి పేరుంది. మండలంలోని పలు సమస్యలమీద గతంలో అధికారులతో పోరాడి వాటి పరిష్కారానికి కృషి చేశారు. ఆమె భౌతికకాయాన్ని ఉత్తరప్రదేశ్ నుంచి అంబులెన్స్‌లో స్వగ్రామానికి శుక్రవారం రాత్రికి తీసుకువస్తున్నట్లు బంధువుల సమాచారం. ఆమె మృతిక్లి మండలంలోని రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు.

ఆదాయ వనరులు పెంచుకోండి

డీపీఓ శంకర్‌నాయక్


శిక్షణ కేంద్రంలో మాట్లాడుతున్న డీపీఓ శంకర్‌నాయక్

కర్లపాలెం: జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా గ్రామ పంచాయతీలలో వికేంద్రీకృత ఘన వ్యర్థాలను విక్రయించటం ద్వారా ఆదాయం పెంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వై.శంకర్‌నాయక్ తెలిపారు. బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెంలోని శిక్షణ కేంద్రంలో శుక్రవారం ఘన వ్యర్థాలను కొనుగోలు చేసే వర్తకులతో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీలలో ఘన వ్యర్థాలను విక్రయించేందుకు మొత్తం 12 మండలాల్లోని 13 పంచాయతీలకు వెయిటింగ్ మిషన్లు అందజేసినట్లు తెలిపారు. తడి చెత్తతో వర్మి కంపోస్టు తయారు చేసుకుని దానిని రైతులకు విక్రయించటం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవాలని డీపీఓ సూచించారు. ఘన వ్యర్థాలను విక్రయించటంలో సెర్ప్ సంస్థ సహకారం తీసుకోవాలని చెప్పారు. తడి, పొడి చెత్తల నిర్వహణల పట్ల పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉండాలని చెప్పారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంతో గ్రామాలు పరిశుభ్రమవుతాయని శంకర్‌నాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎలీషాబాబు, సెర్ప్ సంస్థ ప్రతినిధి శ్రీకృష్ణ, దమ్మనవారిపాలెం సర్పంచి గురపసాల వెంకటేశ్వరమ్మ ఉన్నారు.

పదిలో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

జెడ్పీ సీఈఓ మోహన్‌రావు


మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ మోహన్‌రావు

చెరుకుపల్లి: పది పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాల్లో చదువుకునే విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జెడ్పీ సీఈఓ కె.మోహన్‌రావు సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను సీఈఓ శుక్రవారం సందర్శించారు. తొలుత పాఠశాలలో అమలవుతున్న జగనన్న గోరుముద్ద మెనూ ప్రకారం సక్రమంగా అమలు జరుగుతుందా లేదా అని విద్యార్థులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి తొలి మెట్టు అని అది అధికమిస్తే జీవిత ప్రస్థానం సక్రమంగా ప్రారంభమవుతుందన్నారు. విద్యార్థులు పాఠశాల్లో ఉదయం సాయంత్రం నిర్వహించే ప్రత్యేక తరగతులను సక్రమంగా సద్వినియోగం చేసుకుని పరీక్షకు సన్నద్ధం కావాలన్నారు. పరీక్ష సమయంలో ఆందోళన చెందకుండా ప్రశాంతంగా ఉండి పరీక్ష సమయాన్ని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. తరువాత పాఠశాలలో రికార్డులు పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ఘన వ్యర్థాల నిర్వహణ సంపద కేంద్రాన్ని సందర్శించి గ్రీన్ అంబాసిడర్‌కు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, పాఠశాల హెచ్‌ఎం కె.శైలజ, ఈఓపీఆర్డీ మురళీ పంచాయతీ కార్యదర్శి ఈవూరి విజయ్ బాబు పాల్గొన్నారు.